https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 362 సోమవారం 13-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# తండ్రిని ఏడిపించొద్దు

**కవిత పార్టీ పెట్టాలనుకోవడం ఆమె వ్యక్తిగతం.. వ్యక్తిగత సమస్యలతో పెట్టే పార్టీలు సక్సెస్ కావు**

**గతంలో తప్పులు చేశాం.. సరిదిద్దుకుంటాం.. కార్యకర్తలే కేంద్రంగా రాజకీయాలు చేస్తాం**

**2027లో పాదయాత్ర చేపడతా.. మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు**

**మంచిర్యాల, ఏప్రిల్ 12**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, తన సోదరి కవిత కొత్త పార్టీ పెట్టే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తొలిసారి స్పందించారు. రాజకీయ పార్టీని ఎవరైనా పెట్టవచ్చునని, అయితే పదవుల కోసం, వ్యక్తిగత సమస్యలతో పెట్టే పార్టీలు సక్సెస్ కావన్నారు. పిల్లలు తండ్రిని సంతోషపెట్టకపోయినా ఫర్వాలేదు గానీ.. ఏడిపించవద్దని వ్యాఖ్యానించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరైన కేటీఆర్.. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత కొత్త పార్టీ పెడుతున్న అంశంపై స్పందిస్తూ.. అది ఆమె వ్యక్తిగతమన్నారు. "ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలైనా రావచ్చు. కానీ, ప్రజలు ఓట్లు వేయాలి కదా! వ్యక్తిగత బాధలు చూపిస్తే ప్రజలు నమ్మరు కదా! ఒకరిద్దరు వ్యక్తులు జైలుకు వెళ్లొచ్చి ముఖ్యమంత్రులు అయినంత మాత్రాన.. మళ్లీ అలా జరుగుతుందని అనుకోవడం పొరపాటు. జైలుకెళ్తే సీఎం అవుతారనుకోవడం భ్రమ" అని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రులుగా ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ రాష్ట్రాన్ని చరిత్రలో నిలిచిపోయేలా పాలించారని, వారి స్ఫూర్తితో తాము ముందుకెళతామని చెప్పారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాత పార్టీ రాజకీయంగా నష్టపోయిందన్నారు. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చాలంటూ ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయని, ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై తుది నిర్ణయం కేసీఆర్‌దేనన్నారు. అయితే టీఆర్ఎస్ అనే పేరు ప్రస్తుతం ఖాళీగా ఉందని, ఎవరైనా దానిని పెట్టుకోవచ్చని కవిత ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాగా, తమ కుటుంబంలో ఎలాంటి పదవుల గొడవలు లేవని కేటీఆర్ అన్నారు. గతంలో తాము చిన్న చిన్న తప్పులు చేశామని, ఆ లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. టీడీపీలో నాయకులు నేరుగా కార్యకర్తలతో మమేకమవుతారని, బీఆర్ఎస్‌లో అది లోపించడం వల్లే ఓడిపోయామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే కేంద్రంగా రాజకీయాలు చేశామని, ఇకపై కార్యకర్తలను కేంద్రంగా చేసుకుని రాజకీయాలు చేస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల సమస్యలపై స్పందిస్తూ.. వారికి తాము కూడా పూర్తిగా న్యాయం చేయలేకపోయి ఉండవచ్చునని, అన్నీ చేశామని కూడా తాము చెప్పడం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టడం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై తాను 2027లో పాదయాత్ర చేపడతానని కేటీఆర్ ప్రకటించారు. పదేళ్ల కాలంలో పార్టీకి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని, దానిని తగ్గించేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని లోపాలను కేసీఆర్ బహిరంగంగానే అంగీకరించారని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకత్వాన్ని సమన్వయం చేసుకోవడంలో తాము విఫలమయ్యామన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి లక్షలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాల్లో ఉన్నప్పటికీ, వారి ప్రయోజనాల కోసం సరైన 'గల్ఫ్ పాలసీ'ని తీసుకురాలేకపోయామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కొన్ని రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఇలాంటి లోపాలు తలెత్తాయన్నారు.

**రాష్ట్రంలో దోచుకో.. దాచుకో పథకం!**
సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దోచుకో.. దాచుకో పథకం మాత్రమే నడుస్తోందని కేటీఆర్ అన్నారు. అందుకే ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం మంచిర్యాలలో బీఆర్ఎస్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లో కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను అడ్డం పెట్టుకొని సృజన్‌రెడ్డి రూ.వేల కోట్లు సంపాదిస్తున్నారని ధ్వజమెత్తారు. తాము ఇచ్చిన 16వేల వారసత్వ ఉద్యోగాలపై కాంగ్రెస్ ఏసీబీ విచారణ జరుపుతామంటోందని, ముందుగా సీఎం బావమరిది మీద ఎంక్వైరీలు వేయాలని డిమాండ్ చేశారు.



**డీలిమిటేషన్‌కు అభ్యంతరాలుండవు: కేటీఆర్**
డీలిమిటేషన్ వల్ల రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు పెరుగుతాయని, దీంతో బీఆర్ఎస్‌కు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. ప్రస్తుతం ఉన్న నిష్పత్తి ప్రకారం డీలిమిటేషన్ చేపడితే ఎవరికీ అభ్యంతరాలు ఉండవన్నారు. పార్లమెంటులో ప్రస్తుతం ఎంపీ స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం వాటా ఉందని, ఇకపైనా ఈ శాతం తగ్గకుండా డీలిమిటేషన్ చేపట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీతో కలిసి పోటీ చేయబోమని, బీఆర్ఎస్ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. పొత్తులు తమకు కలిసిరావన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చగలిగితే తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

# 50 శాతం సీట్ల పెంపునకు.. దక్షిణాదిలో 40 శాతం మద్దతు!

**పార్టీల మద్దతు కూడగడుతున్న కేంద్ర పెద్దలు**

**వ్యతిరేక పార్టీలకు చెక్ పెట్టనున్న మోదీ**

**మహిళా బిల్లుతోపాటే పార్లమెంటు ముందుకు**

**తెలంగాణలో జమిలి, మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు ఒకేసారి అమలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 12**
లోక్‌సభ సీట్లను రాష్ట్రాల వారీగా 50 శాతం పెంచే ప్రతిపాదనను పార్లమెంటులో నెగ్గించుకునేందుకు మోదీ సర్కారు తగిన మద్దతు కూడగడుతోంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీసుకొస్తున్న చట్ట సవరణ బిల్లుపై చర్చలో భాగంగానే సీట్ల పెంపు అంశంపై కూడా చర్చ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును ఆమోదించేందుకు ఈ నెల 16 నుంచి 18 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు తమ పార్టీ ఎంపీలకు బీజేపీ విప్ జారీ చేసింది. పార్టీ ఎంపీలందరూ తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొంది. ఎన్డీయేలోని ఇతర భాగస్వామ్య పక్షాలు కూడా విప్ జారీ చేయనున్నాయి. అయితే సీట్ల పెంపు బిల్లు.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులో భాగంగా వస్తుందా? లేక ప్రత్యేకంగా బిల్లు పెడతారా? అన్నదానిపై స్పష్టత లేదు. కానీ, ఈ ప్రత్యేక సమావేశాల్లో నిర్ణయం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, 50 శాతం సీట్ల పెంపు ఫార్ములాకు ఎన్డీయే భాగస్వామ్య పార్టీలన్నీ మద్దతు పలకనున్నాయి. అయితే ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఇందుకు సానుకూలంగా ఉన్న కొన్ని పార్టీల మద్దతును, రెండు కూటములకు చెందని పార్టీల మద్దతును కూడా కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తద్వారా ఈ ఫార్ములాను వ్యతిరేకించే పార్టీలకు చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే 50 శాతం సీట్ల ఫార్ములాతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ, ఇతర ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లనుందంటూ.. దీనిని వ్యతిరేకిస్తున్న పార్టీలు వాదిస్తున్న నేపథ్యంలో.. బీజేపీ ప్రయత్నాలకు దక్షిణాది నుంచి ఏ మేరకు మద్దతు లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 25 ఎంపీ సీట్లు ఉండగా.. ఇందులో టీడీపీ నేతృత్వంలోని కూటమికి 21, వైసీపీకి 4 సీట్లు ఉన్నాయి.

## నేటితో ముగియనున్న డ్రగ్స్ కేసు నిందితుల కస్టడీ

**శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 12**



మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసులో నిందితులైన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి కస్టడీ గడువు సోమవారం ముగియనుంది. దీంతో వారిని పోలీసులు సోమవారం మరోసారి కోర్టులో హాజరుపరచనున్నారు. నిందితులను ఇప్పటికే నాలుగు సార్లు కస్టడీలోకి తీసుకున్న సిట్ అధికారులు పలు కీలక విషయాలను రాబట్టినట్లు తెలుస్తోంది. మరో ఐదురోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు వారు చెప్పారు. మరోవైపు రోహిత్‌రెడ్డి బెయిల్ కోసం సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తరపు న్యాయవాదులు తెలిపారు. నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేస్తుందా? లేదా మరోసారి కస్టడీకి తరలిస్తుందా అనేది సోమవారం తేలనుంది.

## మహిళా రిజర్వేషన్ల అమలులో భాగస్వాములు కండి

**భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను చాటుకుందాం**

**పార్లమెంటులోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకూ ప్రధాని మోదీ లేఖ**

**2023లోనే ఆ చట్టం.. 30 నెలల తర్వాత గుర్తొచ్చిందా?**

**నియోజకవర్గాల పునర్విభజన, ఇతర వివరాలపై స్పష్టత లేకుండా.. ఈ చట్టంపై అర్థవంతమైన చర్చ అసాధ్యం**

**డీలిమిటేషన్‌పై చర్చకు ఏప్రిల్ 29 తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయండి.. మోదీకి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే లేఖ**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12**
మహిళా రిజర్వేషన్ల అమలు కోసం చట్ట సవరణను ఆమోదించే చరిత్రాత్మక ఘట్టంలో.. అందరూ ఏకతాటిపైకి వచ్చి భాగస్వాములు కావాలని పార్లమెంటు ఉభయసభల్లోని అన్ని రాజకీయ పక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించిన అంశం కాదని, ఇది మన మహిళా లోకం పట్ల, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను చాటుకునే సమయమని అన్నారు. నారీ శక్తిని, 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నిజం చేస్తూ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణను ఏకతాటిపైకి వచ్చి ఆమోదిస్తారని తాను నమ్ముతున్నానని మోదీ పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ చట్టం) అమలుపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఉభయసభలలోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకూ లేఖ రాశారు. ఈ ప్రత్యేక సమావేశాలు భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని తన లేఖలో ఆకాంక్షించారు.


"అభివృద్ధి చెందిన భారత్‌ను ఆవిష్కరించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకం. అంతరిక్షం నుంచి క్రీడల వరకూ, సాయుధ దళాల నుంచి స్టార్టప్‌ల వరకూ ప్రతి రంగంలో దేశ ఆడబిడ్డలు తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు రాజకీయాల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగాల్సిన సమయం వచ్చింది. 2029 లోక్‌సభ, శాసనసభల అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహించడం చాలా ముఖ్యం. ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థలో కొత్త శక్తిని నింపుతుంది. పాలనలో మహిళల ప్రాతినిధ్యాన్ని నిర్ధారిస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు. 2023లో పార్లమెంట్‌లో అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా మహిళా రిజర్వేషన్ల చట్టానికి మద్దతు తెలపడం ఒక చిరస్మరణీయ ఘట్టమని గుర్తుచేశారు. మహిళా కోటా అమలుపై గత కొంతకాలంగా రాజ్యాంగ నిపుణులతో, వివిధ రాజకీయ పక్షాలతో సంప్రదింపులు జరపగా.. ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలనే విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తమైందని తెలిపారు. మహిళా రి జర్వేషన్ చట్టాన్ని దాని అసలు స్ఫూర్తితో అమలు చేసే సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు. ఇందుకు సహకరించే పార్లమెంటు సభ్యులు ఈ చరిత్రాత్మక ప్రయత్నంలో భాగమైనందుకు ఎల్లప్పుడూ గర్వపడతారని, ఈ అవకాశాన్ని జారిపోనివ్వకూడదని ప్రధాని సూచించారు. మహిళా రిజర్వేషన్ల అమలుపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "2023లోనే మహిళా కోటా చట్టం చేసినా 30 నెలల పాటు నిద్రపోయి, ఇప్పుడు ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం హడావుడి చేస్తున్నారా?" అంటూ మోదీకి రాసిన లేఖలో సూటిగా ప్రశ్నించారు.

## రాష్ట్రంలో అర్బన్ నక్సల్స్ లేరు

**రోడ్డు ప్రమాదాల నియంత్రణకు 'అరైవ్ అలైవ్'**

**ప్రజలకు మరింత చేరువగా పోలీస్ వ్యవస్థ: డీజీపీ**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12:**



రాష్ట్రంలో అర్బన్ నక్సల్స్ లేరని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. అర్బన్ ప్రాంతాల్లో మావోయిస్టు సానుభూతిపరులు ఉండవచ్చేమో కానీ, సాయుధ నక్సలైట్లు మాత్రం లేరని స్పష్టం చేశారు. మావోయిస్టు గణపతి ఎప్పుడు లొంగిపోతారనే విషయమై తమకు సమాచారం లేదని తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన పోలీస్ గృహ సముదాయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రామగుండం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించాలని సూచించారు.

## 'క్లీన్ ఎనర్జీ'లో రోల్ మోడల్‌గా తెలంగాణ

**సర్క్యులర్ ఎకానమీతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం**

**రూ.700 కోట్లతో నర్మెట్టలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్ట్**

**1400 మందికి ఉపాధి కల్పన**

**భూమి పూజలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఏప్రిల్ 12:**
క్లీన్ ఎనర్జీలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపేలా ప్రత్యేక కార్యాచరణతో కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడం ద్వారా పారిశ్రామిక వృద్ధిని, పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం నర్మెట్టలో 'జునో జౌల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో రూ.700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్రాజెక్ట్‌కు ఆదివారం నిర్వహించిన భూమి పూజకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇప్పటికీ మన దేశం సుమారు 90 శాతం ముడి చమురును, 60 శాతం ఎల్పీజీని విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోందన్నారు. ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలంటే "క్లీన్ ఎనర్జీ"నే కీలకమన్నారు. అందుకు.. గ్రామాలు ఇంధన కేంద్రాలుగా మారాలని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చ్ఛసలా పరిశ్రమలను గ్రామాలకు విస్తరిస్తున్నామన్నారు. నర్మెట్టలో ప్రారంభించబోయే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇక్కడి రైతులు దేశానికి ఇంధనాన్ని అందించే 'శక్తిదాతలు'గానూ చరిత్ర సృష్టిస్తారన్నారు. మూడు దశల్లో క్లస్టర్ పద్ధతిలో నిర్మించబోయే 10 సీబీజీ ప్లాంట్ల(సామర్థ్యం 100 టన్స్ పర్ డే)లో వరి గడ్డి, ఆవు పేడ, కోళ్ల వ్యర్థాలతో బయో ఫ్యూయల్ గ్యాస్ ఉత్పత్తి చేస్తారన్నారు. ఇక్కడ సుమారు 1400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని, ఇందులో 30 శాతం మంది మహిళలే ఉంటారన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన కోసమే ముందుచూపుతో ఈ ప్రాంతంలో భూములు సేకరించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు రావడం వల్లే ఇక్కడ అభివృద్ధి మొదలైందన్నారు. మొన్న రూ.300 కోట్లతో ఆయిల్ ఫ్యాక్టరీ వచ్చినా, ఇప్పుడు బయోగ్యాస్ ప్లాంట్ వచ్చినా రెండింటికీ లింక్ కాళేశ్వరం ప్రాజెక్టే అన్నారు. కాగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. శంకుస్థాపన అనంతరం జరిగిన సమావేశానికి బీఆర్ఎస్ కార్యకర్తలకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఎలా అనుమతించారని వారు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం అందరినీ అనుమతించడంతో గొడవ సద్దుమణిగింది. శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సంతోష్ బాగ్రోడియా, ఎంపీలు భువనేశ్వరి కలిత, ప్రేమ్ చందర్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, రాయపాటి సాంబశివరావు, జునో జౌల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రాయపాటి నాగశరత్ తదితరులు పాల్గొన్నారు.



## ఈత రాక గోదావరి నీటిలో మునిగి విద్యార్థి మృతి

**లక్షెట్టిపేట ఏప్రిల్12(మన సమాజం)**



లక్షట్ పేట పట్టణంలోని కోర్ట్ ఏరియా కు చెందిన మహమ్మద్ ఉస్మానుద్దీన్ అనే 14 సంవత్సరాల విద్యార్థి ఈతరాక ప్రమాదవశాత్తు గోదావరి నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుండి లక్షెట్టిపేట గోదావరి నదిలో స్నానానికి వెళ్ళాడు. నీటిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. ఇది గమనించిన మస్తాన్ గూడకు చెందిన షేక్ అమన్ అనుఆతడు విషయం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలపడంతో కుటుంబ సభ్యులు వచ్చి గోదావరి నీటిలో వెతకగా మృతదేహం లభ్యమయింది. వెంటనే అతన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చూపించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని పెద్దనాన్న షఫీఉద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.

## పరీక్షా ఫలితాలు జీవితం కాదు

**- ఒత్తిడిని వీడండి.. ప్రాణాలను నిలబెట్టుకోండి**

**- ఫలితాల వేళ ఆందోళన వద్దు - మార్కుల కంటే ప్రాణం మిన్న**

**- పిల్లలకు వెన్నుముకగా నిలవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే**




**హైద్రాబాద్, ఏప్రిల్ 12**

పరీక్షా ఫలితాలు వెలువడిన ప్రతిసారీ రాష్ట్రంలో ఒకవైపు ఉత్సాహం, మరోవైపు ఆందోళన నెలకొంటున్నాయి. ముఖ్యంగా ఆశించిన మార్కులు రాకపోవడం లేదా ఫెయిల్ కావడం వల్ల విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యల వంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే విద్యావేత్తలు, మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు మార్కులు కేవలం అంకెలు మాత్రమే, అవి మీ మేధస్సును లేదా భవిష్యత్తును నిర్ణయించే తుది తీర్పులు కావు. ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, ఒక పరీక్షలో వెనుకబడినంత మాత్రాన జీవితం ముగిసిపోదని గుర్తించాలి.విద్యార్థుల ఆత్మహత్యలకు కేవలం మార్కులే కారణం కావు, సమాజం మరియు కుటుంబం నుంచి ఎదురయ్యే విపరీతమైన ఒత్తిడి కూడా ప్రధాన కారణం. పొరుగువారితో పోల్చడం, ర్యాంకుల కోసం వేధించడం వంటి చర్యలు విద్యార్థులను మానసిక కుంగుబాటులోకి నెడుతున్నాయి. ఫలితాలు వచ్చిన తర్వాత పిల్లలను తిట్టడం లేదా కించపరచడం వల్ల వారు ఒంటరితనాన్ని అనుభవిస్తారు. ఈ విపత్కర పరిస్థితుల్లో తల్లిదండ్రులు వారిని హత్తుకుని "మేమున్నామనే" భరోసా ఇవ్వాలి. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగడమే నిజమైన విజయమని వారికి వివరించాలి.తల్లిదండ్రుల పాత్ర ఇక్కడ అత్యంత కీలకం. మార్కులు తక్కువ వచ్చినప్పుడు పిల్లలను మందలించడం మానేసి, వారిని మానసికంగా దృఢంగా మార్చాలి. ఫెయిల్ అయిన సబ్జెక్టులను మళ్ళీ రాసుకునే అవకాశం ఉంటుందని, పరాజయం అనేది విజయానికి తొలిమెట్టు అని వారికి అర్థమయ్యేలా చెప్పాలి. చాలా మంది గొప్ప వ్యక్తులు తమ విద్యాభ్యాసంలో విఫలమైనా, పట్టుదలతో ప్రపంచాన్నే శాసించారని గుర్తుచేయాలి. పిల్లల మనసులోని భయాన్ని పోగొట్టి, వారి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించడం ద్వారానే వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దగలం.ప్రభుత్వం మరియు విద్యాసంస్థలు కూడా ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ఫలితాల అనంతరం విద్యార్థులకు కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచాలి. ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా తక్షణ సలహాలు అందించాలి. కేవలం అకడమిక్ మార్కులకే ప్రాధాన్యం ఇవ్వకుండా, నైతిక విలువలపై అవగాహన కల్పించాలి. విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి, పరీక్షలు అనేవి విద్యార్థి సామర్థ్యాన్ని పరీక్షించడానికి మాత్రమే తప్ప, వారి ప్రాణాలను పణంగా పెట్టడానికి కాదనే సందేశం బలంగా వెళ్లాలి.చివరగా, విద్యార్థులారా! ఒక్క విషయాన్ని గుర్తుంచుకోండి. మీ తల్లిదండ్రులకు మీ మార్కుల షీట్ కంటే మీ చిరునవ్వు, మీ ఉనికి చాలా ముఖ్యం. జీవితంలో ఎన్నో గొప్ప అవకాశాలు మీ కోసం వేచి ఉన్నాయి. ఈ చిన్న పరీక్షా ఫలితాల కోసం నిండు ప్రాణాలను బలి తీసుకోవద్దు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి, రేపటి విజయం మీదే. తల్లిదండ్రులు కూడా ఈ సమయంలో పిల్లలకు స్నేహితులుగా మారి, వారిని ఆప్యాయంగా చూసుకోవాలి. సమాజం కూడా ర్యాంకుల వేటను ఆపి, మానవత్వానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత: డీజీపీ బి. శివధర్ రెడ్డి





**బెల్లంపల్లి, ఏప్రిల్ 12 మన సమాజం :**
రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం బెల్లంపల్లి ఏఆర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన "సురక్షితంగా చేరుదాం -- మన కుటుంబాలకు ఒక హామీ" అనే అవగాహన సదస్సులో డీజీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 750 మంది హత్యలకు గురవుతుండగా, రోడ్డు ప్రమాదాల్లో ఏకంగా 7,500 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గతంలో ట్రాన్స్‌పోర్ట్ శాఖ, పోలీస్ శాఖలు కృషి చేసినప్పటికీ, ఇది ఒక్కరితో సాధ్యం కాదని, ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని తెలిపారు. గ్రామ వార్డు సభ్యుల నుంచి సర్పంచ్ వరకు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయి వరకు అందరూ రోడ్డు భద్రతపై దృష్టి పెట్టాలని అన్నారు. తాను 26 ఏళ్ల క్రితం బెల్లంపల్లిలో అదనపు ఎస్పీగా పని చేసినప్పుడు వాహనాల రద్దీ తక్కువగా ఉండేదని, ప్రస్తుతం బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి ప్రాంతాల్లో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.

**భద్రతా సూచనలు:**

**మోటార్ సైకిల్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి**

**ఫోర్ వీలర్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ఉపయోగించాలి**

**మద్యం సేవించి వాహనాలు నడపకూడదు**

ఆటోల్లో అధిక ప్రయాణికులను ఎక్కించకూడదు కార్యక్రమానికి ముందు డీజీపీకి బెల్లంపల్లి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు గౌరవ వందనం నిర్వహించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేశారు. అలాగే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలు అందజేశారు.ఈ నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలు, మరణాలు గణనీయంగా తగ్గుతాయని డీజీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీలు ప్రవీణ్ కుమార్, ఆర్. ప్రకాష్, సీఐలు శ్రీనివాసరావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# కన్నెపల్లిలో నూతన పోలీస్ భవనాన్ని ప్రారంభించిన డీజీపీ బి. శివధర్ రెడ్డి






**బెల్లంపల్లి, ఏప్రిల్ 12 (మన సమాజం):**
తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ఆదివారం మంచిర్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మల్టీజోన్-× ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కలిసి కన్నెపల్లికి చేరుకున్నారు. డీజీపీకి మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. పూజారులు పూర్ణకుంభంతో ఆతిథ్యం అందించగా, అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కన్నెపల్లిలో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని డీజీపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ మరియు ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతన పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ భాస్కర్ రావును కుర్చీలో కూర్చోబెట్టి డీజీపీ, ఐజీ, ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు మరింత చేరువగా ఉండి మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ అత్యాధునిక భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. సాంకేతికతను వినియోగించి భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నూతన భవనం ద్వారా మెరుగైన పోలీసింగ్‌తో పాటు ప్రజలకు సేవలు వేగవంతం అవుతాయని, ఆ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి డీజీపీ మొక్కలు నాటారు.

# స్వస్థ వెల్నెస్ సెంటర్ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు అంజలి నరసయ్య






**లక్షెట్టిపేట, ఏప్రిల్ 12 (మన సమాజం):**
లక్షెట్టిపేట మండలంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా, సద్గురు శ్రీ మధుసూదనా సాయి సత్యసాయి సుజల స్రవంతి ట్రస్టు ఆధ్వర్యంలో సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు అంజలి నరసయ్య, వైస్ చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని, వీటి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని పేర్కొన్నారు. అలాగే శివ సాయి గణేష్ సేవ సమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కె.వి. ప్రతాప్, డాక్టర్లు సురేష్, సతీష్, శృతి, కాస్టిక్ సీఈవో పాటిబండ్ల శైలజ, ట్రస్ట్ ప్రతినిధులు కళ్యాణ్ చక్రవర్తి, మల్లేశం, మోహన్ రెడ్డి, పెట్టం తిరుపతి, నరేంద్ర భీమన్న, ధనలక్ష్మి, రవి, ప్రసాద్, ప్రభాకర్, గఫూర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల తొలగింపులో వేగం

**- అమీన్పూర్‌లో ఆక్రమణలపై హైడ్రా కఠిన చర్యలు**

**- 861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్**

**అమీన్పూర్, ఏప్రిల్ 12**

అమీన్పూర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు హైడ్రా అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. దాదాపు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు ఫెన్సింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ చర్యలు రాత్రి వరకు కొనసాగగా, ఆదివారం ఉదయం తిరిగి పనులను ప్రారంభించి వేగవంతం చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను కూడా తొలగించారు. ముఖ్యంగా ముకీం సోదరుడు అజీమ్ నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని సుమారు 90 శాతం వరకు కూల్చివేయడం జరిగింది. పక్కనే ఉన్న అపార్టుమెంట్లకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం. భవనం కూల్చివేతలో జాగ్రత్తలు పాటించడంతో కొంత సమయం పట్టినప్పటికీ, పనులు సజావుగా సాగుతున్నాయి.ప్రభుత్వ భూమిని పూర్తిగా రక్షించేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం కీలకంగా మారింది. అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు. భూమి ఆక్రమణలకు చెక్ పెట్టే దిశగా ఈ చర్యలు కీలకమని అధికారులు తెలిపారు.ఈ చర్యలపై స్థానికులు సానుకూలంగా స్పందిస్తున్నారు. గతంలో భయాందోళనల్లో జీవించాల్సి వచ్చేదని, ఇప్పుడు హైడ్రా చర్యలతో భరోసా కలిగిందని ప్రజలు చెబుతున్నారు. తమ ఇళ్లను కూల్చివేయరాదని ప్రభుత్వం ఇచ్చిన హామీతో ఆందోళనలు తొలగిపోయాయని పేర్కొన్నారు. ఖాళీ స్థలాలను కాపాడుతూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా భూములు సురక్షితంగా మారాయని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు ఆక్రమణలు చేసి వందల ఎకరాల భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవడం హైడ్రా కఠినతను చూపుతోందని స్థానికులు అభినందిస్తున్నారు. అక్రమాలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. మొత్తంగా అమీన్పూర్‌లో చేపట్టిన ఈ చర్యలు ప్రభుత్వ భూముల రక్షణలో కీలక ఘట్టంగా నిలుస్తున్నాయి.

# కవి పండిత బాలకుడు

తెలుగులో రాసేవాళ్ళతో, చదివేవాళ్ళతో సంభాషణ కోసం ఉవ్విళ్ళూరేవారు వేలూరి వెంకటేశ్వరరావు గారు. అలా కవులు కూచుని హస్కు కొట్టుకోడాన్ని ఆయన అనేవారు. 1992లో ఒక వేసంగి. అట్లాంటాలోన.. తెలుగులో రాసేవాళ్ళతో, చదివేవాళ్ళతో సంభాషణ కోసం ఉవ్విళ్ళూరేవారు వేలూరి వెంకటేశ్వరరావు గారు. అలా కవులు కూచుని హస్కు కొట్టుకోడాన్ని ఆయన ైవ-వ అనేవారు. 1992లో ఒక వేసంగి. అట్లాంటాలోన పెమ్మరాజు వేణు గోపాలరావుగారు ఇంట్లో ఒక్కళ్ళే ఉన్నారు. నన్ను "ఏఁవండీ రండి... వేలూర్ని కేకేస్తాను! రండి!!" అని పిలిచేరు. వాళ్ళిద్దరూ అలా కేకేస్తే నేను లొట్టలేసుకుంటూ చాల దూరం డ్రైవ్ చేసుకుని వెళ్ళేను. కెరొలీనా, జార్జియా పీచ్ పళ్ళ దుకాణాలు, +ఘంశీశ్రీఅఅవ 1వి అనే హోర్డింగ్‌లు దాటుకుంటూ. వేణుగోపాలరావు గారింట్లో పెరడు, నడవాలు బొమ్మరిళ్ళలా కళాత్మకంగా తీర్చిదిద్దుకున్నారు. ఆయన అప్పట్లో కవులందరివీ ఒక్కో కవిత తీసుకుని సంకలనంగా వేసేరు-- మచ్చు తునకలు అని కాబోలు. ఆ పుస్తకం బల్ల మీద పెట్టుకుని వేలూరి గారు భోజనాల బల్ల మీద సిద్ధంగా కూర్చున్నారు. ఆయన సైన్సదీ చాల చదువుకున్నారు, కాని ఆయనకి నిజంగా ఇష్టమైన శాస్త్రం సామాన్య శాస్త్రం కాదు, సాహిత్య శాస్త్రం. అరవైలనాటి ఆంధ్ర యూనివర్శిటీ, అబ్బూరి, తిలక్, శ్రీశ్రీ ఇవన్నీ ఆపకుండా మాట్లాడుతూనే ఉన్నారు. ఆ రోజు భోంచేస్తూ "అన్నం తినేటప్పుడు ఏ సమయంలో 'ఇంక చాలు!' అనుకుని లేవాలో అది... అది చాల కష్టం!" అని చెప్పేరు. ఆయనకి నిజంగా ఇష్టమైన భోజనం, 'ఇంక చాలు!' అని ఎలా ఎప్పుడనుకోవాలో తెలీకుండా భోంచేసే విందు సాహిత్యం. అంటే కాయితాల మీద పేజీల్లో, ఒకర్నొకరు కేకేసుకునీ, ైవ-వలలోనూ ఆబగా జుర్రుకునేది. అప్పటికింకా ఇంటర్నెట్, వెబ్ అని ఏఁవీ లేవు. ఇంట్లో వేణుగోపాలరావుగారు ఒక్కరే ఉన్నారు. చెస్ లాంటి ఆటలు ఆడేవాళ్ళు, పేకాడేవాళ్ళు, చిన్నపిల్లలూ ఇంటికెవరొచ్చినా "రా! ఒకెత్తు వేద్దాం?!" అని సతాయిస్తారు కదా. వేలూరి వ్యవహారం అంతా అలాగే ఉండేది "రండి! కవిత్వం గురించీ, రైటర్స్ గురించీ మాట్లాడుకుందాం!" అని కవ్విస్తున్నట్టు, కాలు దువ్వుతున్నట్టూ. కవి తిలక్ గురించి చాలా చెప్పేరు. తిలక్ అంటే పారవశ్యంలా ఉండేది నాకు. అవన్నీ అడిగడిగి, నోరెళ్ళబెట్టుకుని విన్నాను. ఆయన ఎవర్నీ ఊరకే ఉండనిచ్చేవారు కాదు. సంభాషణ ఏ మాత్రం ఆగినా "ఊఁ ఇంకేంటండీ చెప్పండి..?" అని చర్చని ఎగసనదోసేవారు. అది వివాదం అయితే ఆయనకి మరింత ప్రీతి. పేరుమోసినవాళ్ళు, రకరకాల బులుపులు, ప్రలోభాలున్న మనుషుల్ని గురించి నిక్కచ్చిగా ఎత్తిపొడుస్తూ నవ్వించేవారు. అలాగే ఆయన గౌరవించే మనుషులు, వాళ్ళ వ్యాసంగాల గురించి విశేషంగా పొగుడుతూ చెప్పేవారు. సంభాషణ అంటే వాదం, ప్రతివాదమున్నూ. అటుంచి ఆయన ఒక బాణం వేస్తే, ఇట్నుంచి మనం ఒక ప్రతిబాణం వెయ్యాలి. చర్చ ఇలా "రగడ రగడ రగడం! కానీరా జగడ జగడ జగడం!!" లాగ రంజుగా రాజుకోవాలి. కాఫీలవీ రప్పిస్తూ, పదిమందిమీ నవ్వు మొహాలు పెట్టుకుని వింటూ, అంటూ తింటూ వినోదిస్తూ, సాహితీ ప్రపంచపు మనుషులు, పుస్తకాల నిజాల నిగ్గుతేల్చటం ఇది ఆయనకి ప్రియమైన విందు భోజనం. సైంటిష్ట్, మార్క్సిష్ట్, ఎన్నారై సాహితీ దిగ్గజం ఇలాంటి గుర్తింపులు ఎన్నున్నా ఆయన మౌలికంగా ఇలా అమర్త్య సేన్ గారు చెప్పినలాంటి ఫక్తు రసవాది, ఇంకా ప్రతివాది భయంకరుడు – **Argumentative Indian.** ఆ తరవాత 1998లోనేమో, టెక్సస్ లోనో ఎక్కడో తెలుగు సభల్లో ఆయనతో, నారాయణరావు గారితో కలిసి నడుస్తూ భోజనాల కోసం వెతుక్కున్నామని గుర్తొస్తోంది. ఆయనలో సాహిత్య కాంక్ష ఇంత ప్రబలంగా ఎందుకు వేళ్ళూనుకుందో అర్థం చేసుకోవాలంటే ఆయనకు చిన్నతాతగారైన వేలూరి శివరామ శాస్త్రి గారి చరిత్రని, ఆయన కుటుంబ నేపథ్యాన్నీ చదువుకుంటే బోధపడుతుందేమో. శివరామ శాస్త్రి గారు గొప్ప కవి, మహా పండితుడు. కవులకీ కవులకీ వాగ్యుద్ధాలు జరిగే సత్తెకాలపు రోజుల్లో ఆయన తమ గురువులు తిరుపతి వేంకట కవుల తరపున ఎగస్పార్టీ (కొప్పరపు) కవుల మీద 'బస్తీ మే సవాల్!' లాంటి కవిత్వ బాణాలు ప్రయోగించి రంగ ప్రవేశం చేసేరనీ, విస్తృతంగా శతావధానాలు చేసేరనీ చరిత్ర. వస్తుతః సాధువు, పరమ కారుణ్యమూర్తి అయిన శివరామశాస్త్రి గారినే రెచ్చగొట్టగలిగిన ఇలాంటి రసకందాయమైన సాహిత్య వాతావరణం, కుటుంబ నేపథ్యాల ప్రభావం ఒకవైపు, ఈ పాత వాగ్వైభవాల వాసనల్ని, పద్ధతుల్నీ చాదస్తమని గ్రహించుకుని, తమ సాంస్కృతిక వారసత్వం సమస్తాన్నీ 'బ్రాహ్మినిజం' అని తిరస్కరించి, అవమానిస్తూ వచ్చిన కొత్త కాలపు శాస్త్రీయ దృక్పథం, సామ్యవాదం, ఆధునిక విద్యల ప్రభావం ఇంకొకవైపు వేంకటేశ్వర రావు గారిని చెరొకవైపూ లాగుతూ ప్రభావితం చేసి ఉంటాయి. ఈ పెనుగులాటలో మార్క్సే గెలిచాడు. వ్యక్తిత్వం అంటే మనం పెరిగి పెద్దయ్యేక కావల్సినవి నాలుగూ ఎంచుకొని బాహ్యంగా ప్రకటించుకోగలిగినది మాత్రమే కాదు. బాల్యం నుండి మనకంటూ ఏ వ్యక్తిత్వమూ ఇంకా ఏర్పడని రోజుల్లో మన అనుభవాలు, విన్నవి చూసినవీ అనుభవించినవీ ఇవన్నీ మన వ్యక్తిత్వాల్ని, ప్రవర్తననూ విశేషంగా, తప్పనిసరిగా ప్రభావితం చేస్తాయి. కృష్ణ కర్ణామృతం లోని శ్లోకం ఒకటి. యశోద చిన్ని కృష్ణుణ్ణి జోకొడుతూ రామకథ చెప్తుంది: "రామో నామ బభూవ, హుం, తదబలా సీతేతి, హుం" అని మొదలౌతుంది. ఆ కథ వింటూ ఊ కొడుతూ నిద్రపోతున్న వాడల్లా కృష్ణుడు-- సీతాపహరణం, రావణుడి ప్రసక్తి వచ్చే సరికి ఉలిక్కిపడి దిగ్గున లేచి 'లక్ష్మణా! నా విల్లెక్కడ? ఏదీ, ఏదీ తే?!' అని లేస్తాడు. లీలాశుకుడు నాలుగే పాదాల్లో ఇంత కథనూ చిత్రించిన పద్ధతి చాల మనోహరంగా ఉంటుంది. ఈ శ్లోకమంటే వేలూరి చెవి కోసుకునేవారు, ఇష్టంగా వర్ణించేవారు. 2010లో అనుకుంటాను. అట్లాంటాలో వాళ్ళింటికెళ్ళేను. ఏమీ మాట్లాడలేననీ పాట పాడతానని అనంటే సరే పాడండి అన్నారు. ప్రయాగ రంగదాసు కృతి రామ రామయనరాదా అనుంది, అది పాడేను. నవ్వుకుని ఉంటారు, 'ఇలా దేవుడి పాటలా పాడుకుంటున్నాడు!' అని. నాతో ఏమీ అనలేదు. తను పెంచుకుంటున్న మిరప మొక్కల్ని చూపించేరు. ఆయన, శాంతి గారు నేను వెళ్తుంటే మళ్ళీ రావాలి నాల్రోజులుండాలి అని పదే పదే చెప్పేరు.

# అసలు ఊహించామా ఇంతమంది పాఠకులను !

2022 వరకూ తెలుగు సాహిత్య స్థితిగతులు బయట ప్రపంచం దృష్టిలో పెద్ద చడీచప్పుడు లేకుండా ఉండేవి. ఉన్న కొద్దిమంది రచయితలో వారిలో వారు సాహిత్యాన్ని గురించి, రచనలను గురించి చర్చించుకుంటూ ఉండేవారు. ఒకరు రాసింది ఇంకొకరు చదవరనీ, సాహిత్యం పట్ల యువతలో ఆసక్తి సన్నగిల్లిపోతోందనీ రకరకాలుగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ పరిస్థితిని మార్చడానికి తోచిన పద్ధతిలో కొంతమంది సాహిత్యవేత్తలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రయత్నాలు చేస్తూండేవి. నవలల పోటీలు నిర్వహించడం, ఉత్తమ కథలను ఎంపిక చేసి సంచికలు తీసుకురావడం వగైరా ప్రయత్నాలు అందులో భాగంగా ఉండేవి. కానీ, ఇవేమీ ఆ కాస్త సాహిత్యలోకాన్నీ దాటుకుని పుస్తకాలు ముట్టుకోని జనాలపై ప్రభావం చూపించేవి కాదు. ఎవరైనా పుస్తకాలు చదవడానికి ఆసక్తి చూపించినా ఇళ్ళలో పెద్దవాళ్ళ నుంచి కాలేజీ లెక్చరర్ల వరకూ ప్రతీవారూ ఇంగ్లీష్ పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివితే కనీసం ఇంగ్లీష్ అయినా నేర్చుకోవచ్చు అని ఉచిత సలహాలు వచ్చేవి. ఇక క్రమేపీ డిజిటల్ కంటెంట్, అందులోనూ రీల్స్, షార్ట్స్ వంటివి ప్రాచుర్యం చెందుతూ ఉండడంతో అసలంటూ పుస్తకాలకే చోటు తగ్గిపోతున్న ప్రపంచంలో తెలుగు పుస్తకాలకు కాలం చెల్లిపోయినట్టే అందరూ భావించారు. మొత్తంగా, ఒక పుస్తకం 2000 నుంచి 4000 వేల కాపీలు విడుదలైన కొద్ది సంవత్సరాల్లో అమ్మగలిగితే అప్పట్లో గొప్ప విజయం సాధించినట్టే. బహుశా, కొద్ది మినహాయింపులు తప్ప పలు భారతీయ భాషల సాహిత్యవేత్తలు, పాఠకులు ఈ పరిస్థితిని రిలేట్ చేసుకోగలరు అనుకుంటాను. అయితే, 2024-25 సంవత్సరాల్లో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2023 వరకూ తెలుగులో అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాల కేటగిరీలో కొన్ని వేల కాపీలు అమ్ముడైన పుస్తకాలూ, ఆంగ్ల బెస్ట్ సెల్లర్ల తాలూకు అనువాదాలూ, కొన్ని దశాబ్దాల క్రితం నాటి క్లాసిక్స్ వంటివి ఉండడం పరిపాటి కాగా ఈ స్థితి 2024 నాటికి మారిపోయింది. ఐర్లాండ్‌లో స్థిరపడ్డ ఎన్నారై రవి మంత్రి రాసిన ఒక కొత్త ప్రేమకథాత్మక నవల-'అమ్మడైరీలో కొన్ని పేజీలు' 2024 సంవత్సరంలోనే కొన్ని నెలల వ్యవధిలో వేగం పుంజుకుని లక్ష కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించింది. ఈ నవల ఇదే వేగాన్ని 2025లోనూ కొనసాగిస్తూ లక్షా డెబ్భై అయిదువేల కాపీలు అమ్ముడైంది. పైగా పుస్తకాలు పట్టుకోరన్న అభిప్రాయం ఉన్న యువతలోకి ఈ నవల చొచ్చుకుపోవడం చాలామంది సాహిత్యపరులకు ఆశ్చర్యకరంగా తోచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ నవల చదువుతున్నట్టు వీడియోలు చేయటం, చదివి రివ్యూలు పోస్ట్ చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. ఇన్ని పుస్తకాలు నిజంగా అమ్ముడు కావట్లేదని, ఇదంతా కేవలం మార్కెటింగ్ గిమ్మిక్ కావచ్చని ఈ పరిణామాన్ని చూసి సందేహపరులు అనుమానించారు. అయితే, జాతీయ స్థాయిలో అమెజాన్ ట్రెండ్స్‌లో యువల్ నోవా హరారీ, సుధామూర్తి, అరుంధతీ రాయ్ వంటివారి రచనలను, 'సైకాలజీ ఆఫ్ మనీ', 'అటామిక్ హాబిట్స్' లాంటి పుస్తకాలను దాటుకుని నెంబర్ 1 సెల్లర్‌గా నెలల పాటు నిలబడుతూ ఉండడమూ, చివరకు 2014లో అమెజాన్ ఇండియా ప్రకటించిన టాప్ 10 పుస్తకాల్లో రెండోస్థానంలో నిలవడమూ ఈ సందేహాలను పటాపంచలు చేశాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్, విజయవాడ బుక్ ఫెయిర్ వంటిచోట్ల కూడా ఈ పుస్తకాన్ని జనం కొనడమూ, రచయిత భారతదేశానికి తిరిగివచ్చినప్పుడు హైదరాబాద్‌లో జరిగిన వివిధ 'మీట్ ద ఆథర్' కార్యక్రమాలకు భారీ స్పందన రావడమూ వంటివి కూడా ఈ కొత్త పరిణామాన్ని కళ్ళకు కట్టాయి. రవి మంత్రి 2024లోనే ఆన్‌లైన్‌లో కాంటెంట్ క్రియేటర్‌గా, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా విజయవంతం అవుతూ ఉండడంతో ఇదంతా కేవలం ప్రచారార్భాటం వల్ల జరిగిన ఒక వన్ ఆఫ్ పరిణామం అని తెలుగు సాహిత్యాన్ని దశాబ్దాలుగా గమనిస్తున్న చాలామంది కొట్టిపారేశారు. అయితే, యువ సాహిత్యకారులు కడలి సత్యనారాయణ రాసిన 'చిక్ లిట్', మహమ్మద్ గౌస్ రాసిన '826 కిమీ', ప్రసాద్ రామతోట రాసిన '90స్ లవ్‌స్టోరీ', శ్రీనివాస్ కాశెట్టి రాసిన 'అయోధ్య చేరిన కృష్ణ'... ఇవన్నీ కొన్ని నెలల వ్యవధిలోనే పదుల వేల కాపీలు దాటాయి. 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' పుస్తకం లక్షన్నర కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించడానికి ముందే వి. మల్లికార్జున్ 'ఇరానీ కేఫ్', సీతారామరాజు 'రామగ్రామ నుంచి రావణలంకకు' వంటి పుస్తకాలు కొద్ది నెలల్లోనే పలు రీప్రింట్లతో కొత్త పాఠకులను సంపాదించాయి. దీన్ని బట్టి కూడా ఇదేమీ హఠాత్తుగా రాత్రికి రాత్రి వచ్చిన పరిణామం కాదని అర్థమవుతుంది. మరోవైపు, వివిధ పబ్లికేషన్లు, ఆడియో బుక్స్ యాప్‌లు వంటివి కూడా అభివృద్ధి చెందుతున్నాయి (అజు పబ్లికేషన్స్, అన్వీక్షికి పబ్లిషర్స్, ఛాయ బుక్స్, ఎలమి పబ్లికేషన్స్ వంటి పబ్లిషింగ్ సంస్థలు, దాసుభాషితం వంటి ఆడియో బుక్స్ యాప్‌లు ఇందుకు ఉదాహరణ.). ఇన్‌స్టాగ్రామ్‌లో పుస్తకాల గురించి చర్చించి, వాటిని ప్రమోట్ చేసే బుక్‌ఫ్లుయెన్సర్లు ఈ పరిణామంలో ఒక కీలకమైన తోడ్పాటును అందిస్తున్నారు (తెలుగు కలెక్టివ్, ఆరుద్ర ఈశ్వర్, విముక్త సుధ వంటివారు ఇందుకు ఉదాహరణ). మొత్తంగా, ప్రభుత్వ ప్రోత్సాహం, పెద్ద సంస్థల మద్దతు, సినిమా ప్రముఖుల ప్రోత్సాహం... ఇవేమీ లేకుండా ఒక ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకని ఈ పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? ఎవరు కొంటున్నారు? ఎందుకు కొంటున్నారు? ఎలాంటి పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? వంటి విషయాలపై అనక్‌డోటల్ రిఫరెన్సులు మినహాయిస్తే పరిశోధనలు కానీ, స్టడీలు కానీ పెద్దగా జరిగినట్టు కనిపించడం లేదు. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో చేసిన ప్రచారం వల్ల పుస్తకాలు అమ్ముకోగలుగుతున్నారని విమర్శనాత్మకంగా రాస్తున్నవారు కూడా పాఠకులు ఎందుకు కొంటున్నారో, ఈ పుస్తకాల్లో ఏం ఆకర్షిస్తోందో లోతుగా పరిశీలించిన దాఖలాలు లేవు. తెలుగు కలెక్టివ్ అన్న ఇన్‌స్టాగ్రామ్ పేజీని స్థాపించి దాన్ని ఒక సాహిత్య, సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేస్తున్నవారిలో ఒకడైన ఆదిత్య అన్నావఝుల ఈ విషయంపై మాట్లాడుతూ, "యంగ్‌స్టర్స్ వాళ్ళని వాళ్ళు చూసుకునేలాంటి రిలేటబుల్ కంటెంట్ ఉండడం, సులువుగా అర్థమయ్యే భాషలో రాయడం బాగా లాభిస్తోంది. సాహిత్యంలో సామాన్యంగా ఉండే వివిధ వాదాలకు ఈ రచనలు సామాన్యంగా దూరంగా ఉంటున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్ కావడం, అమెజాన్ ప్లాట్‌ఫాంలో సజెషన్లు వంటివీ, పుస్తక ప్రచురణ విషయంలో ఇంతకుముందున్న బేరియర్స్ తగ్గిపోవడం ఈ మార్పు విషయంలో దోహదం చేసింది" అన్నాడు. 1990ల్లో ప్రారంభమైన ఇండస్ట్రియలైజ్డ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోచింగ్ మోడల్ వల్ల భాషకు, సాహిత్యానికి దూరమైపోయిన తరాలు తిరిగి వాటివైపు ఆకర్షితులవుతున్నాయా? షార్ట్ ఫామ్ కంటెంట్‌కి అడిక్ట్ అయ్యారనీ, భారతీయ భాషల పట్ల ఆసక్తి చూపట్లేదనీ అంతా భావించే యువత తిరిగి లాంగ్‌ఫామ్ కంటెంట్ వైపు వస్తున్నారనేందుకు, అందులోనూ భారతీయ భాషల పుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారనేందుకు ఈ ట్రెండ్ తొలి సంకేతమా? ఈ కోణాల్లో మరింత లోతుగా పరిశీలించి తెలుసుకోవాల్సి ఉంది. అయితే, అంతవరకూ ఈ పరిణామాన్ని ఆసక్తితో చూసి సంతోషించవచ్చు.

# కార్మికులకు ఉరితాళ్లు...

నరేంద్ర మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలు లేని సమయాన కనీసం కార్మిక సంఘాలతో ఏ మాత్రం చర్చ లేకుండానే 2020లో అప్రజాస్వామికంగా ఆమోదించింది. ప్రతిపక్షాల తోపాటు దేశంలోని అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ఇప్పటికే ఐదుసార్లు జరిగిన సార్వత్రిక సమ్మెల్లో పాల్గొని 50 కోట్ల మంది కార్మికులు నిరసన వ్యక్తం చేసినా ఎంతమాత్రం పట్టించుకోకుండా మోదీ సర్కార్ లేబర్ కోడ్‌లను ఆమోదించుకున్నది. 2026 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ కోడ్‌లను అమల్లోకి తీసుకవస్తామని కేంద్రం 2025 నవంబర్ 26న ప్రకటించింది. దీనిని అత్యంత దుర్మార్గమైనదని కార్మిక సంఘాలు అభివర్ణిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధీనంలో ఉన్న కార్మిక శాఖలో నాలుగు లేబర్ కోడ్‌లపై రాష్ట్ర అసెంబ్లీల అభిప్రాయాలను తీసుకోకుండానే ఏకపక్షంగా అమలు చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం కార్మిక వర్గం మెడకు ఉరితాళ్లు బిగించడమే అవుతున్నది. నిజానికి 29 కార్మిక చట్టాల్లో కార్మిక నష్టపరిహార చట్టం 1923, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ చట్టం 1926, స్టాండింగ్ ఆర్డర్ల చట్టం 1946, వేతనాల చెల్లింపు చట్టం 1936 మాత్రమే బ్రిటిష్ ప్రభుత్వం కాలంలోనివి. ఈ నాలుగు చట్టాలు తప్ప మిగిలిన 25 కార్మిక చట్టాలు 1947 తర్వాత రూపొందించినవే. అయితే, బ్రిటిష్ కాలపు నాటి వలస చట్టాలను మారుస్తున్నట్టు మోదీ ప్రభుత్వం చెప్పే మాటలు కార్మికులను మోసం చేసేందుకు చెప్పే అబద్ధాలు మాత్రమే. ప్రజాస్వామ్యబద్ధమైన స్ఫూర్తికి భిన్నంగా మోదీడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకరావడం, వాటి అమలుకు పూనుకోవడం కార్పొరేట్ ప్రయోజనాల కోసం 50 కోట్ల మంది కార్మికులకు ద్రోహం తలపెట్టే వైఖరి తప్ప మరొకటి కాదు. అయితే, నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఎంతో ప్రయోజనకరమని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటున్నది. కార్మికుల సంఘంలో ఉంటే వారిని యాజమాన్యాలు అదిలించి, బెదిరించి కార్మిక సంఘాలనే తమ నియంత్రణలోకి తీసుకురావడానికి తోడ్పడే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. పర్మినెంట్ కార్మికులు లేకుండా పని గ్యారెంటీ లేకుండా చేసేందుకు కోడ్ చాప్టర్ 1 సెక్షన్ 2(0) ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ చట్టబద్ధం చేస్తుంది. అంటే ముందస్తు నోటీసు, నోటీస్ పే ఏమీ లేకుండానే తొలగించటం, పనిలో, గనిలో కార్ఖానాల్లో, పర్మినెంట్ కార్మికులను, సంఘాలను లేకుండా చేయటమే దీని ఉద్దేశం. ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారం 10 అధ్యాయం ప్రకారం 99 మంది కార్మికులు పనిచేసే సంస్థను మూసివేయాలంటే యాజమాన్యాలు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ 300 మంది కార్మికులు ఉన్న సంస్థలను మూసివేయడానికి ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని లేబర్ కోడ్‌లలో పేర్కొంటున్నది. అంటే యాజమాన్యాలు తమ ఇష్టారాజ్యంగా సంస్థలను లే ఆఫ్ చేయడం, రీట్రెంచ్ చేయడం, మూసివేయటం చేయవచ్చని ప్రభుత్వం హామీ ఇస్తున్నది. ఇందు వల్ల 74 శాతం మంది కార్మికులకు ప్రమాదం జరుగనున్నది. పారిశ్రామిక వివాదాల చట్టం సెక్షన్ 22 ప్రకారం పబ్లిక్ యుటిలిటీ సర్వీస్‌లో 14 రోజుల ముందు సమ్మె నోటీస్ ఇవ్వవచ్చు. సెక్షన్ 23 ప్రకారం ఇతర సంస్థల్లో 14 రోజుల ముందు సమ్మె నోటీసు ఇవ్వవచ్చు. కొన్ని సంస్థల్లో సమ్మె నోటీసు ముందస్తుగా ఇచ్చి సమ్మెలకు వెళ్తారు. యాజమాన్యం సమస్యలు పరిష్కరించకుండా మొండికేసిన సందర్భంలోనే అనివార్యంగా కార్మికులు పోరాటానికి వెళ్లటం సహజ హక్కుగా ఉన్నది. లేబర్ కోడ్‌లో సెక్షన్ 62(1) (ఖ)ప్రకారం సమ్మెకు, నోటీసుకు 60 రోజుల వరకు సమ్మె చేయకూడదని, కన్సిలేషన్ ముగిసిన ఏడు రోజుల్లోపు సమ్మె చేయకూడదని పేర్కొంటున్నది. సమ్మెకు ప్రోత్సహించినా, ఆర్థికంగా సహకరించినా కార్మికులను, కార్మిక నాయకులను బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 11 ప్రకారం ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపించి శిక్షలు వేయించటం, భారీ జరిమానాలు విధించడం చేసుకోవచ్చని లేబర్ కోడ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. కచ్చితంగా ఇది దేశంలో ఉన్న సంఘటిత రంగ కార్మికులకు ఉరితాడు బిగించడం మాత్రమే. మోదీ ప్రభుత్వం దేశాన్ని వెనుకకు నడిపించే విధంగా, మనుధర్మ కాలం నాటికి మళ్లించే విధంగా నేడు 8 గంటల పని దినాన్ని రద్దు చేసి 12 నుంచి 15 గంటలు పనిచేయించాలని లేబర్ కోడ్‌లు పేర్కొంటున్నాయి. కంపెనీల 8.83% నుంచి 20% వరకు బోనస్ చెల్లించే అవకాశం ప్రస్తుత చట్టంలో ఉన్నది. కోడ్‌లో బోనస్ చెల్లించాల్సిన అవసరం లేదు. కంపెనీల బ్యాలెన్స్ షీట్‌ను కార్మిక సంఘాలకు కార్మికులకు చూపించాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నది. వేతనాల చెల్లింపు మోసాలకు పాల్పడిన యజమానులపై 10 రెట్లు పెనాల్టీ విధించి కార్మికులకు మేలు చేసే అవకాశం చట్టపరంగా ఉన్నది. కోడ్‌లో దానిని తొలగించారు. అంతే కాకుండా కాంట్రాక్టు కార్మికులకు వేతనాల చెల్లింపును కాంట్రాక్టర్ విస్మరిస్తే దానికి ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా యాజమాన్యాలదే బాధ్యత అని చట్టంలో ఉన్నది. లేబర్ కోడ్‌లు దానిని రద్దు చేసి కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యానికి వదిలివేయటం దుర్మార్గం. కార్మికులకు ఏ ఒక్క ప్రయోజనం కల్పించే అవకాశం నాలుగు లేబర్ కోడ్‌లలో లేదు. కార్మికులను కార్పొరేట్ సంస్థలు, యాజమాన్యాలకు కట్టుబానిసలుగా మార్చే ఉద్దేశంతోనే ఈ లేబర్ కోడ్‌లను మోదీడీ ప్రభుత్వం తీసుకువచ్చింది.



## రాజ్ ప్రేమలో సాంత్వన

నాగచైతన్యతో విడాకుల అనంతరం దాదాపు నాలుగేళ్ల పాటు సమంత జీవితం అనేక ఒడిదుడుకులతో సాగింది. ముఖ్యంగా అరుదైన మయోసైటిస్ వ్యాధి బారిన పడటం అశనిపాతంలా మారింది. అయితే ఈ కష్టాలన్నింటిని ధైర్యంగా ఎదుర్కొంది సమంత. మిత్రులు, శ్రేయోభిలాషుల అండతో తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చింది. గత ఏడాది దర్శకనిర్మాత రాజ్ నిడిమోరుతో రెండో వివాహం తర్వాత నూతనోత్తేజంతో కనిపిస్తున్నది సమంత. ఈ నేపథ్యంలో విడాకుల అనంతరం తన మానసిక పరిస్థితి గురించి, రాజ్ నిడిమోరుతో రెండో పెళ్లి తర్వాత పొందిన సాంత్వన గురించి సమంత సోషల్‌మీడియాలో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టింది. 'విడాకుల అనంతరం ఒక్కసారిగా జీవితమంతా శూన్యంలా అనిపించింది. ఇకముందు ఒకరిపై ఆధారపడి జీవితాన్ని కొనసాగించొద్దనే నిర్ణయానికొచ్చాను. కానీ విధి మరోలా తలచింది. రాజ్‌తో స్నేహం, అతను పంచిన ప్రేమాభిమానాలు నాకు కొత్త జీవితాన్ని పరిచయం చేశాయి. అతని సాంగత్యంలో ఇప్పుడు మరింత ఉన్నతమైన వ్యక్తిగా పరివర్తన చెందాను' అని చెప్పుకొచ్చింది సమంత. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సమంత తెలుగులో నటిస్తూ నిర్మించిన 'మా ఇంటి బంగారం' మే 15న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే.

## శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు..

### అయిన కూడా ఏకంగా స్టార్ హీరో సరసన ఛాన్స్?



సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లు--ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఐ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో అజిత్-శ్రీలీల కాంబినేషన్‌పై చర్చలు జోరుగా సాగుతున్నాయి.

## బాఫ్టాలో 'బూంగ్' సంచలనం

### మణిపురి సినిమాకు దక్కిన అరుదైన గౌరవం




ప్రపంచ సినీ వేదికపై భారతీయ సినిమాకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టీవీ ఆర్ట్స్‌లో (బాఫ్టా) మణిపురి చిత్రం 'బూంగ్' పురస్కారాన్ని గెలుచుకుంది. బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ కేటగిరీలో ఈ చిత్రాన్ని ఎంపిక చేశారు. ఈ విభాగంలో పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ సినిమాగా 'బూంగ్' చరిత్ర సృష్టించింది. లక్ష్మీ ప్రియా దేవి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఫర్హాన్ అక్తర్ నిర్మించారు. గుగున్ కిప్జెన్, బాలా హిజమ్ నిగ్తోజమ్, అన్గామ్ సనామాటుమ్ కీలక పాత్రల్ని పోషించారు. మణిపూర్ జాతుల సంఘర్షణ, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో బూంగ్ అనే బాలుడు తన కుటుంబాన్ని కలపడానికి చేసే ప్రయత్నం నేపథ్యంలో మానవీయ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల చిత్రాలను అధిగమించి 'బూంగ్' అవార్డును కైవసం చేసుకుంది. బూంగ్ 'బాఫ్టా' అవార్డును గెలుచుకోవడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సృజనాత్మక కౌశలానికి దక్కిన గొప్ప గౌరవమని ఎక్స్ వేదికగా ఆయన చిత్రబృందాన్ని అభినందించారు.

## 'బ్లడీ రోమియో'తో రొమాన్స్?

ఒక్క భారీ హిట్ చాలు కథానాయికల జాతకం మారిపోవడానికి. బాలీవుడ్ హీరోయిన్ త్రిప్తి డిమ్రి విషయంలో అదే జరిగింది. 'యానిమల్' సినిమాతో ఈ భామ యువతరంలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అంతకుముందు ఈ సొగసరి హిందీలో ఐదు చిత్రాల్లో నటించినా అంతగా గుర్తింపు రాలేదు. 'యానిమల్'తో ఒక్కసారిగా అగ్ర కథానాయికల జాబితాలో చేరిపోయింది. ప్రభాస్ 'స్పిరిట్' చిత్రం ద్వారా ఈ భామ తెలుగులో ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం త్రిప్తి డిమ్రి తెలుగులో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. నాని కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' పేరుతో ఓ చిత్రం తెరకెక్కబోతున్నది. ఇందులో త్రిప్తి డిమ్రిని కథానాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించిందని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

